క్లుప్తంగా

నేడు తిరుకల్యాణ మహోత్సవం

ఎటపాక: తోటపల్లిలో రమాసహిత సత్యనారాయణస్వామి వారి తిరుకల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. వైశాఖ శుద్ధ ఏకాదశి ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అర్చకుడు గొట్టుపుళ్ల చెన్నకృష్ణమాచార్యులు స్వామివారి కల్యాణం నిర్వహిస్తారని పేర్కొంది.

పుస్తక పఠనంతో విజ్ఞానం

జి.మాడుగుల: విజ్ఞాన వికాసానికి విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని గ్రంథాలయాధికారి వంపూరి మహేష్ తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 15 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఇందులో భాగంగా పిల్లలకు కథలు చెప్పుట, విజ్ఞానానికి సంబంధించి పుస్తకాలు చదివించటం, చిత్రలేఖనం వేయించటం, పిల్లల శారీరక వికాసానికి దోహదపడేలా వివిధ రకాల ఆటలు ఆడించటం, వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వచ్చే నెల 7న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా ప్రతిభ కనబరిచిన పిల్లలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

సీహెచ్‌సీకి రోగుల తాకిడి


ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో బారులు తీరిన రోగులు

ముంచంగిపుట్టు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రోజు రోజుకు రోగుల తాకిడి పెరుగుతోంది. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో జ్వరాలు, దగ్గు, జలుబు వంటి రోగాల బారిన పడుతుండడంతో ఆరోగ్య కేంద్రాలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. శనివారం ఒక్కరోజే ఓపీ 194గా నమోదైంది. వారం రోజుల్లో ఇక్కడ 1,213 మంది వైద్య సేవలు పొందారు. నిత్యం వైద్యాధికారులు గీతాంజలి, సంతోష్ వైద్య సేవలందిస్తున్నారు. ఆస్పత్రి ప్రాంగణం రోగులతో నిండిపోవడంతోపాటు రక్తపరీక్షల గది ఎదుట బారులు తీరారు. ఈ నేపథ్యంలో కిలగాడ, లబ్బూరు, రూడకోట పీహెచ్‌సీల పరిధి గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గిరిజన గ్రామాల్లో వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు.

అభిషేక పీఠకం బహూకరణ


పూజారికి అభిషేక పీఠకం అందజేస్తున్న దాత పుట్టా ప్రకాష్

సాక్షి,పాడేరు: స్థానిక అయ్యప్పస్వామి టెంపుల్ కాంప్లెక్స్‌లో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి మందిరానికి వస్త్ర వ్యాపారి పుట్టా ప్రకాష్ అభిషేక పీఠకంను బహూకరించారు. ఇక్కడ ఉత్సవ విగ్రహానికి పూజలు చేయడానికి గాను ఆలయ పూజారికి శనివారం ఆయన దీన్ని అందజేశారు. స్థానిక భక్తులంతా సంతోషం వ్యక్తం చేశారు.

రాజకీయ నాయకులు సయమనం పాటించాలి


నాయకులతో మాట్లాడుతున్న సీఐ గజేంద్రకుమార్

చింతూరు: గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు తావులేకుండా రాజకీయ పార్టీల నాయకులు సయమనం పాటించాలని చింతూరు సీఐ గజేంద్రకుమార్ అన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలన్నారు. ఫలితాల అనంతరం ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, సమావేశాలు నిర్వహించవద్దని, బాణసంచా కాల్చొద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

జల సిరులు చేరువై...


చెరువు నిర్మాణ పనులు(ఫైల్)


చెరువు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

- 'సమీకృత వ్యవసాయ పరివర్తన పథకం'తో సాగునీటి ఇబ్బందులకు చెక్
- అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో 98 చెరువుల నిర్మాణ పనులు
- ఇప్పటికే చివరి దశకు చేరుకున్న 42 చెరువుల నిర్మాణం
- ఒక్కోదాని అంచనా వ్యయం రూ.30 లక్షల నుంచి రూ. 60 లక్షలు
- మొత్తం నిర్మాణాల అంచనా వ్యయం రూ.28 కోట్లు
- 2025 నవంబర్ నాటికి ప్రాజెక్టు పూర్తికి ప్రణాళికలు

సాక్షి, అనకాపల్లి: ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి పరిరక్షించుకోవాలి. వ్యవసాయానికి అనుకూలంగా.. ఆత్మబంధువుగా మలుచుకోవాలి. శివారు పంట పొలాలు సైతం నీరు లేక ఎండిపోయే పరిస్థితి ఉండకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యం. అందుకే ఏపీ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో 98 చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం అమలు పూర్తయితే చిన్న, సన్నకారు రైతులకు సాగునీటి ఇబ్బందులు తీరుతాయి. వాతావరణంలో మార్పుల కారణంగా వర్షాలు లేక సకాలంలో పంటలు పండించలేకపోతున్నారు. దీంతో అన్నదాతలు ఆశించినంత మేర ఆదాయం పొందలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఏపీ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకం ద్వారా నిర్మాణం చేపడుతున్న చెరువులు రైతులకు ఆత్మబంధువుల్లా మారుతున్నాయి. వర్షాలు కురిసే సమయంలో చెరువుల్లో నీరు నిల్వ ఉంచితే అన్నదాతలకు అవసరమయ్యే సమయంలో ఉపయోగపడుతుంది. ముందస్తుగా తగిన నీటి సదుపాయం ఉంటే వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందడానికి ఆస్కారం ఉంటుంది.

7:3 నిష్పత్తిలో నిర్మాణం

ప్రపంచ బ్యాంకు 70 శాతం, ఏపీ ప్రభుత్వం 30 శాతం నిధులతో సంయుక్తంగా ఈ పథకం ద్వారా చెరువుల నిర్మాణం చేపట్టారు. మొత్తం 98 చెరువుల నిర్మాణం, ఆధునికీకరణకు శ్రీకారం చుట్టగా.. వాటిలో 42 చెరువుల నిర్మాణ పనులు చివరిదశకు చేరుకున్నాయి. మరో 22 చెరువులు నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి. 34 చెరువుల నిర్మాణం పనులు టెండర్ దశలో ఉన్నాయి. రూ.28 కోట్లతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఒక్కో చెరువు నిర్మాణానికి రూ.30 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు కేటాయించారు. వచ్చే ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో శరవేగంగా పనులు నిర్వహిస్తున్నారు. ఇందులో స్వతంత్ర, గొలుసు కట్టు చెరువులు, పెద్ద చెరువులు, చిన్న చెరువులు ఉన్నాయి.

ఐదు శాఖలు సంయుక్తంగా..

వాతావరణంలోని మార్పులను తట్టుకుని వ్యవసాయ ఉత్పాదకతను, ఆదాయాన్ని పెంచే విధంగా రైతులు పంటలను పండించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని విస్తృతం చేశారు. వ్యవసాయ, భూగర్భజల, నీటిపారుదల, ఉద్యానవన, మత్స్యశాఖ సంయుక్తంగా చెరువుల నిర్మాణాలు చేపడుతున్నాయి. కనీసం 100 ఎకరాల నుంచి గరిష్ఠంగా 150 ఎకరాల వరకూ సరిపడా సాగు నీటిని నిల్వ ఉంచే సామర్థ్యం ఒక్కో చెరువుకు ఉంటుంది. చెరువుల్లో నీటి సాంద్రతను నెలవారీ పిజోమీటర్ డ్రిల్లింగ్ చేసి తెలుసుకునే సదుపాయం కూడా కల్పించారు.

రెండు లక్షల మంది రైతులకు లబ్ధి

అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ఈ చెరువుల నిర్మాణం ద్వారా సుమారు రెండు లక్షల మందికి పైగా చిన్న, సన్నకారు రైతులు లాభపడనున్నారు. చెరువుల నిర్మాణం, అభివృద్ధితో భూగర్భ జలాల పెరుగుదల సాధ్యమవుతుంది. చెరువుల అభివృద్ధితో రైతులు సకాలంలో పంటలు వేసుకోవడంతో పాటు ఏడాదికి మూడు పంటలు పండించుకునే అవకాశం కలుగుతుంది. వ్యవసాయ సామర్థ్యాన్ని పెంచుకోవడం, వాతావరణ సానుకూల పద్ధతులను ప్రోత్సహించడం సాధ్యపడుతుంది.

రైతు బాంధవులుగా చెరువుల నిర్మాణం



అన్నదాతలకు ఉపయోగపడేలా చెరువుల నిర్మాణం, అభివృద్ధి పనులు సాగుతున్నాయి. ఏపీ సమీకృత సాగునీరు వ్యవసాయ పరివర్తన పథకం 2020లోనే ప్రారంభమైంది. కరోనా కారణంగా పనులు మందకొడిగా సాగాయి. ఆ తరువాత నుంచి శరవేగంగా పనులు జరుగుతూ వస్తున్నాయి. వచ్చే ఏడాది నవంబర్ నెలాఖరునాటికి పనులు పూర్తి చేయాలన్నది లక్ష్యం. గ్రామాల్లో వ్యవసాయానికి తోడ్పాటు అందించేవి చెరువులే. వర్షాలు పడేటప్పుడు నీరు నిల్వ ఉండేందుకు చెరువులు ఉపయోగపడతాయి. వ్యవసాయానికి నీరు అందించే బోరుబావుల్లో వేసవి సమయాల్లో నీరు అడుగంటకుండా సహాయపడుతుంది. భూగర్భజలాలను నిల్వచేయడంతో పాటు చేపల పెంపకంతో మరింత ఆదాయ వనరులను పెంచుకోవచ్చు. ప్రధానంగా వ్యవసాయ సాగునీటి విస్తీర్ణం పెంచుకోవచ్చు.

-కె.రమేష్‌బాబు, ఏపీఐఐఏటీపీ సహాయ ప్రాజెక్టు అధికారి

నేడు వాకర్స్‌క్లబ్ సమావేశం

అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ ఆవరణ గుమస్తాల సంఘం కార్యాలయంలో ఆదివారం ఉదయం 7 గంటలకు వాకర్స్‌క్లబ్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు క్లబ్ అధ్యక్షుడు భీశెట్టి రామకృష్ణ, కార్యదర్శి వై.సాంబశివరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రోజు కూలి రూ.300 గిట్టుబాటు కావాలి

ఉపాధి ఏపీవో సురేష్‌కుమార్


శరభవరంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీవో సురేష్‌కుమార్

రాజవొమ్మంగి: రోజు కూలీ రూ.300 గిట్టుబాటు అయ్యేలా కొలతల ప్రకారం ఉపాధి పని చేయాలని ఏపీవో సురేష్‌కుమార్ తెలిపారు. శరభవరం, తెల్లకొండ గ్రామాల్లో ఉపాధి పనులను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గతంలో రోజు కూలి రూ. 273 మాత్రమే ఉండేదన్నారు. ప్రస్తుతం రూ.300కు పెరిగిందన్నారు. మండలంలో 8 వేల జాబ్ కార్డుదారులకు గాను 13,700 మంది ఉన్నారన్నారు. ప్రస్తుతం రోజుకు 5,600 మంది పనులకు వస్తున్నారన్నారు. ఈ ఏడాది మండలానికి రూ.14 కోట్ల విలువైన పనులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ పనుల్లో ముఖ్యంగా అమృత సరోవర్ పథకం కింద కాలువల పూడిక తీత, పంతరోడ్లు, కొత్త చెరువుల తవ్వకం తదితర పది రకాల పనులు చేస్తున్నామన్నారు.

కొయ్యూరులో భారీ వర్షం


కురుస్తున్న వర్షం


ముంచంగిపుట్టులో కురుస్తున్న వర్షం

కొయ్యూరు: శనివారం సాయంత్రం కొయ్యూరులో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడు ప్రతాపం చూపించినా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారింది. కారు మబ్బులతో భారీ వర్షం కురిసింది. వర్షాలు కురవడంతో పశుగ్రాసం పెరుగుతుంది. ఇంత వరకు పశుగ్రాసం లేకపోవడంతో పశువులు అవస్థలు పడ్డాయి. రైతులు ఖరీఫ్ పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

వారపు సంతకు వర్షం దెబ్బ

ముంచంగిపుట్టు: వారపు సంతకు వర్షం దెబ్బ తగిలింది. ముంచంగిపుట్టులో శనివారం సాయంత్రం ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి వ్యాపారులు, కొనుగోలుదారులు పరుగులు పెట్టారు. రోడ్లపై వరదనీరు భారీగా ప్రవహించింది. వర్షం వల్ల కూరగాయల వ్యాపారం సక్రమంగా జరగలేదు. తీవ్ర నష్టాలు చూడాల్సి వచ్చిందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. సంతబయలు, ఇందిరాకాలనీల్లో వరద నీరు ఇళ్ల ముంగిట నిలిచిపోయి బురదమయంగా మారింది. రాకపోకలకు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గాలులకు పలు పంచాయతీల్లో జీడిమామిడి నేల పాలైంది. చేతికి కాపు వచ్చే సమయంలో వర్షాలు రూపంలో తీవ్ర నష్టాలు మిగిల్చాయని గిరిజన రైతులు వాపోయారు. ఉదయం అంతా ఎండ తీవ్రతతో అల్లాడిన మండల వాసులకు వర్షంతో ఉపశమనం లభించినట్లయింది. వర్షంతో మధ్యాహ్నం నుంచి విద్యుత్ అంతరాయం నెలకొంది.

యువ ఐఏఎస్ నరేంద్రపడాల్ స్ఫూర్తిదాయకం


యువ ఐఏఎస్ నరేంద్రపడాల్‌ను సన్మానిస్తున్న సర్పంచ్, ఉద్యోగ సంఘాల నాయకులు, స్థానికులు

హుకుంపేట: గిరిజన యువతకు యువ ఐఏఎస్ చిట్టపులి నరేంద్రపడాల్ స్ఫూర్తిదాయకమని సర్పంచ్ తామర్ల సత్యనారాయణ తెలిపారు. మండలంలోని అండిబ పంచాయతీకి చెందిన యువ ఐఏఎస్ నరేంద్రపడాల్‌ను ఉద్యోగ సంఘాల నాయకులు, గ్రామస్తులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ ఉన్నత చదువుల్లో రాణించడంతో మంచి భవిష్యత్తు ఉంటుందని అనడానికి నిదర్శనం నరేంద్రపడాల్ అన్నారు. స్వగ్రామానికి మంచిపేరు తెచ్చినందుకు అభినందించారు. అనంతరం తల్లిదండ్రులు చిట్టపులి దాల్‌పడాల్, విజయ భారతిలను ఘనంగా సత్కరించారు. వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు, ఉపాధ్యాయులు తామర్ల నాగేశ్వరరావు, కొండయ్యపడాల్, వైస్ సర్పంచ్ రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ రమేష్


మాట్లాడుతున్న ఎంపీపీ, పక్కన జెడ్పీటీసీ

కొయ్యూరు: పీవీటీజీలు (ఆదివాసీల) అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కృషి చేస్తుందని ఎంపీపీ బడుగు రమేష్ తెలిపారు. ఏళ్ల తరబడి సాగు చేస్తున్న వారికి భూమిపై హక్కు లేకపోవడంతో వందలాది మందికి ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఇప్పించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఆయన అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నల్లగొండ పంచాయతీలో బోయపుట కొత్తవీధి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తే అటవీ శాఖ అధికారులు నిలిపివేశారన్నారు. రోడ్డుకు రూ.5.5 లక్షలు వచ్చినా అటవీ శాఖ అనుమతి లేక ఆగిందన్నారు. దీనిపై కొందరు తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ ప్రాంత అటవీ శాఖ అనకాపల్లి జిల్లా పరిధిలో ఉండడం మూలంగా తొందరగా సమస్య పరిష్కారం చేయడం సాధ్యం కాలేదన్నారు. రావణాపల్లి ఎంపీటీసీ సత్యవేణి ఈ సమస్యను త్వరగా పరిష్కారం చేయాలని కోరారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. కాకరపాడులో రెండు బోర్‌వెల్స్ వేయించేందుకు జెడ్పీ నుంచి అనుమతి వచ్చిందన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే పనులు ప్రారంభిస్తారన్నారు. ఐటీడీఏ కాలనీ, వెలగలపాలెం గ్రామాలకు జీజీఎం నిధులు రూ.7.5 లక్షల చొప్పున వచ్చాయన్నారు. కోడ్ ముగియగానే పనులు ప్రారంభిస్తారన్నారు. వర్షాలు కురవడంతో జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జెడ్పీటీసీ వారా నూకరాజు, వైస్ ఎంపీపీ అంబటి నూకాలు, ఎంపీడీవో కార్యాలయ ఏవో బాల మురళీకృష్ణ, జేఈ రామకృష్ణ, ఏపీవో రాజు, వైద్యుడు మనోజ్ఞ, జీసీసీ బీఎం విజయకుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం ఖాయం

ఎంపీపీ రమేష్, జెడ్పీటీసీ నూకరాజు


మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఇతర నేతలు

కొయ్యూరు: మండలం నుంచి వైఎస్సార్‌సీపీకి 7 నుంచి 8 వేల ఓట్ల మెజారిటీ వస్తుందని ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, వైస్ ఎంపీపీ అంబటి నూకాలు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి ముసిలినాయుడు ధీమా వ్యక్తం చేశారు. శనివారం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పొందిన వారంతా ఫ్యాన్‌కే ఓటు వేశారన్నారు. మహిళలు ఓట్లు వేసేందుకు భారీగా తరలి రావడం శుభ సూచికమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేయాలన్న ఆకాంక్షతో ప్రజలు పెద్ద ఎత్తున ఓటేశారన్నారు.

కొన్ని చోట్ల కూటమికి ఓట్లు పడినా ఎక్కువ బూత్‌ల వద్ద ఫ్యాన్‌కు ఓట్లు వేశారన్నారు. గతంలో పది వేలకుపైగా ఓట్ల మెజారిటీ వచ్చిందన్నారు. పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి ఎం విశ్వేశ్వరరాజు, అరకు ఎంపీ గుమ్మా తనూజరాణి భారీ మెజారిటీతో గెలుస్తారని చెప్పారు. ఫ్యాన్ గాలి గట్టిగా వీచిందన్నారు. కూటమి తప్పుడు లెక్కలు వేసి గెలుస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రతీ కుటుంబం ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిందని చెప్పారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే జైలు


మాట్లాడుతున్న ఎస్ఐ సంతోష్‌కుమార్

వై.రామవరం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి జైలు పాలవ్వవద్దని ఎస్ఐ ఎం. సంతోష్ కుమార్ ప్రజలకు సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా మండల ఎగువ ప్రాంతం దారగడ్డ పంచాయతీ లింగవరం గ్రామంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పోలీసులు సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించుకోవాలన్నారు. యువత పెడదోవ పట్టకుండా కాపాడుకునే బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందన్నారు. జూదం, కోడిపందేలు వంటి అసాంఘిక కార్యకలాపాల జోలికి పోయి చితికిపోవద్దన్నారు. సారా వంటివి సేవించి ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దన్నారు. మూఢ నమ్మకాలతో వ్యాధిని ముదరపెట్టు కోకుండా సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లి మెరుగైన వైద్య సేవలు పొందాలన్నారు. అసాంఘిక శక్తులకు సహకరించొద్దన్నారు. గంజాయి అక్రమ వ్యాపారులకు సహకరించి, జైలు పాలవ్వద్దని సూచించారు. గంజాయి కేసులో అసలు నేరస్తులు తప్పించుకుని, ఎంతోమంది అమాయక గిరిజనులు జైలు పాలయ్యారన్నారు. పోలీసు శాఖ గిరిజన ప్రాంత అభివృద్ధిలో పాలు పంచుకుంటూ యువతను ఉత్తేజపరచడానికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

1,360 క్వింటాళ్ల వరి విత్తనాలకు ఏర్పాట్లు


పచ్చిరొట్ట ఎరువుగా పెరిగిన జీలుగ


ఏవో రమేష్‌నాయుడు

రాజవొమ్మంగి: ఖరీఫ్ సాగుకు రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తుగానే వ్యవసాయాధికారులు విత్తనాలు సిద్ధం చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండటంతో ఇప్పటికే రైతులు వేసవి దుక్కులు పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో మండలంలోని 16 రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతులకు పంపిణీ చేసేందుకు 1,360 క్వింటాళ్ల వరి వంగడాలు అవసరమని గుర్తించారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఈ విత్తనాల్లో 4,300 ఎకరాల్లో వరి సాగు చేపట్టేందుకు సరిపోతాయి. ఎంటీయూ 1061 రకం 635.50 క్వింటాళ్లు, ఎంటీయూ 1318 రకం వరి వంగడాలు 336 క్వింటాళ్లు, ఎంటీయూ 1121 రకం 100 క్వింటాళ్లు, ఎస్ఎల్ఆర్ 34449 రకం 52.10 క్వింటాళ్లు, ఎంటీయూ 1064 రకం 236.50 క్వింటాళ్ల వంగడాలు ఉన్నాయి. అధికారుల ఆదేశాల మేరకు సబ్సిడీ పోను రైతు చెల్లించాల్సిన ధర ప్రకటించనున్నామని ఏవో రమేష్‌నాయుడు తెలిపారు.

ఆర్బీకేల వారీగా వరి విత్తనాలు

జడ్డంగి పరిధిలోని అమీనాబాద్, జడ్డంగి, చెరకుంపాలెం, తంటికొండ రైతు భరోసా కేంద్రాలకు 405.1 క్వింటాళ్లు, రాజవొమ్మంగి పరిధిలోని బదనంపల్లి, దూసరపాము, గడుఓకుర్తి, కింద్ర, లబ్బర్తి, రాజవొమ్మంగి-1, 2 , శరభవరం రైతు భరోసా కేంద్రాలకు 637 క్వింటాళ్ల వరి విత్తనాలు, వాతంగి పరిధిలోని లోదొడ్డి, చికిలింత, వంచంగి, వాతంగి రైతు భరోసా కేంద్రాల్లో 318 క్వింటాళ్ల వరి విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచనున్నారు.

5 టన్నుల జీలుగ విత్తనాలు

పచ్చిరొట్ట ఎరువుకు సంబంధించి ఐదు టన్నుల జీలుగ విత్తనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వరి పండించే భూమిలో ఎకరాలో పది కిలోల జీలుగ విత్తనాలు వెదజల్లుకోవాలి. విత్తిన 40 రోజులకు జీలుగ ఏపుగా పెరుగుతుంది. ఆ మొక్కలను భూమిలో కలిసేలా బాగా కలియదున్నుకోవాలి. దీనివల్ల పంటకు అవసరమైన నత్రజని పుష్కలంగా లభిస్తుంది. తద్వారా రసాయన ఎరువుల వాడకం, అధిక పెట్టుబడులను తగ్గించుకోవచ్చు. ప్రతి రైతు వరి నాట్లకు ముందు పచ్చిరొట్టను పెంచి మంచి దిగుబడులు సాధించాలి.

అలరించిన నాటిక ప్రదర్శనలు


బంధం నాటిక

అనకాపల్లి: స్థానిక గవరపాలెం వీవీ రమణ రైతు భారతి ఫంక్షన్ హాల్లో శనివారం రెండో రోజు ప్రదర్శించిన నాటికలు ఆహూతుల్ని అలరించాయి. జీవీఎంసీ మెయిన్‌రోడ్డు పెద్ద హైస్కూల్‌కు చెందిన 1974-75 పదో తరగతి పూర్వపు విద్యార్థులు, జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో నాటిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థుల ప్రతినిధి కె.ఎం.నాయుడు మాట్లాడుతూ ఆదివారం కూడా నాటిక పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు.


'బంధం' విలువను చెప్పేలా...

మనిషి జీవితం 'బంధం'తో మొదలవుతుంది. తల్లిదండ్రులు, తోడబుట్టినవాళ్లు, మిత్రులు, గురువులు, పెళ్లయ్యాక భార్యాబిడ్డలు..ఇలా ఎన్నోబంధాలు. కానీ కడదాకా కలిసి ప్రయాణం చేసే భార్యాభర్తల బంధం ఎంతో పటిష్టమైనది. విడదీయరానిది. అందునా వృద్ధాప్యంలో ఈ బంధం మరింత బలపడి ఒకరికొకరుగా ఒకరికోసం ఒకరిగా మిగిలిపోతారు. దంపతుల మధ్య తగవులు, కీచులాటలు తాత్కాలికం, క్షణంలో మళ్లీ కలుస్తారు. కానీ కొత్తదనాన్ని తన వెర్రి ఆలోచనలతో కోరుకున్న సుబ్బారాయుడు లోకం హర్షించని రీతిలో భార్యను దూరం పెడతాడు. స్నేహితుడు నారాయణ హితోక్తులు వినడు, తానొక కొత్త గేమ్ మొదలెట్టాననుకొంటాడు. ఆ గేమ్‌ను తలకిందులు చేస్తూ ఆపైవాడు మరోగేమ్ ఆడి అతడ్ని మనస్తాపానికి గురిచేస్తాడు, తట్టుకోలేని సుబ్బారాయుడు విలపిస్తాడు, ఊహించని మరో మలుపులో కళ్లు తెరిచి తన తప్పును దిద్దుకుంటాడు.

'నాన్న బంగారు' రెండో నాటిక....

ఎదురుగా ఉన్న బిడ్డను ముద్దుపెట్టుకున్నప్పుడు కలిగే అనుభూతి, ఆ బిడ్డ ఫొటోను ముద్దు పెట్టుకున్నప్పుడు కలుగదు. ఎందుకంటే మొదటి దానిలో జీవం ఉంటే, రెండో దానిలో దాని ప్రతిబింబం ఉంటుంది. అలాగే, వీడియో కాల్‌లో మనిషికి, మనిషికి మధ్య స్క్రీన్ అడ్డం ఉంటుంది. వీడియో కాల్ బిడ్డ ఫొటోను ముద్దు పెట్టుకోవడం లాంటిది. కుటుంబ సభ్యులు అందరూ కలిసి ఉండాలి. వారి మధ్య స్వచ్ఛమైన ప్రేమ, అభిమానాలు ఉండాలి అదీ అసలైన సంపద అంటే. ఆ సంపదను ఇప్పుడు కొందరు తల్లిదండ్రులు చేజేతులా జార విడుచుకుంటున్నారు. మేం ఎక్కడికీ వెళ్లము, మీ దగ్గరకే ఉంటాం అని కొడుకులు ప్రాధేయ పడుతూ వున్నా, పక్కింటి సుబ్బారావు కొడుకు అమెరికా, ఎదురింటి పంకజం అల్లుడు ఆస్ట్రేలియా, నువ్వు ఇక్కడ ఉంటే, మా తల కొట్టేసినట్లుగా ఉంటుంది.. నువు వెళ్లి తీరాలి అని కొడుకుల్ని బలవంతంగా దూరం చేసుకుంటున్నారు. కానీ జీవితం చాలా చిన్నది. అందులో ఆఖరి దశలో మనిషికి ఓదార్పు, ఊరట ఇచ్చేది కన్నబిడ్డల సాన్నిధ్యం, ఆత్మీయ స్పర్శ. అందులో వుండే భరోసా, ఆనందం అమెరికా డాలర్‌లో లేదు అని చేతులు కాలాక గ్రహిస్తారు. మనిషికి కావలసిన సంపద ఏమిటీ అని తెలియజేసేదే నాన్న బంగారు నాటిక. ఈ రెండు ప్రదర్శనలూ ఆలోచింపజేస్తూ ఆహూతులను అలరించాయి.

వజ్ర కవచాలంకరణలో వెంకన్న



కొంకోట: కొంకోటలోని వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో వైశాఖ శుద్ధ దశమి పురస్కరించుకొని స్వామి వారిని వజ్ర కవచధారణతోపాటు వివిధ రకాల పూలమాలల, తులసీ మాలలతో శనివారం చూడముచ్చటగా అలంకరించారు. విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో దర్శించి పూజలు చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.